క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



బాల్కొండ: ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని టీఎస్ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లోని తన నివాసంలో పలువురు గ్రామస్తులు, బాధితులు తమ సమస్యలను అనిల్‌కు గురువారం విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల సమస్యలపై పరిష్కరించాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి



ఆర్మూర్‌టౌన్: వినియోగదారులు హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం వినియోగదారుల సంఘం దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన కరప్రతాలను ఆర్డీవో రాజాగౌడ్, మండల సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ అధ్యక్షుడు సింహయ్య, బోచ్‌కర్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

రుద్రూర్: పొతంగల్ మండలం సోంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను అధికారులు గురువారం ప్రారంభించారు. గ్రామానికి 57 ఇళ్లు మంజూరు కాగా పీఎస్ఆర్ నగర్‌లో మూడు, సోంపూర్‌లో చేపట్టనున్న రెండు ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చందర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు విడతల వారీగా బిల్లులు వస్తాయని, సకాలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. జీపీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మికి ఉత్తమ ఉద్యోగి పురస్కారం



పెర్కిట్: ఆర్మూర్ మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ భాగ్యలక్ష్మి ఉత్తమ మహిళా ఉద్యోగిగా పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం ఉత్తమ మహిళా ఉద్యోగులను ఎంపిక చేసి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, శేఖర్, మాణిక్యం, కె శశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో షుగర్ పరీక్షలు

రుద్రూర్: మండల కేంద్రంలో గురువారం ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో స్థానికులకు షుగర్ పరీక్షలు నిర్వహించారు. షుగర్ కంట్రోల్‌లో ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గౌరి, ఇందిరా తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెన..!

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



వంతెనపై కుంగిన ప్రాంతంలో హెచ్చరికగా పెట్టిన డబ్బా

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులోని వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్దవాగు రోడ్డుపై నిర్మించిన ఈ వంతెన గత ఏడాది కుంగింది. ఆ సమయంలో కుంగిన చోట మట్టి పోశారు. వంతెన ఇలా తరచూ కుంగుతూనే ఉంది. వంతెనపై కుంగిన ప్రాంతంలో పలువురు వాహనదారులు ఎలాంటి ప్రమాదాలు గురికాకుండా ఉండేందుకు ఇటుకలు, డబ్బాలు పెట్టారు. సంబంధిత అధికారులు మాత్రం మరమ్మతు చర్యలు చేపట్టలేదు. ఈ రోడ్డు గుండా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాగంపేట్ శివారులో..

నాగంపేట్ శివారులో ఉన్న మరో వంతెన పరిస్థితి ఇలానే ఉంది. ఆ వంతెనపై గత వాన కాల సీజన్‌లో పెద్ద రంధ్రం ఏర్పడి కుంగింది. రెండు నెలల క్రితం తారు రోడ్డుకు ప్యాచ్‌లు చేసినప్పుడు స్వల్ప మరమ్మతులు చేపట్టారు. కానీ అధిక లోడ్‌తో వాహనాలు వెళ్తుండడంతో మళ్లీ కుంగుతోంది. పెద్దవాగు రోడ్డు పునరుద్ధరణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు.

ప్రతిపాదనలు పంపించాం

పెద్దవాగు రోడ్డుపై ఉన్న వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం.
– నాందేవ్, డీఈఈ, ఆర్అండ్‌బీ, బాల్కొండ

బోధన్‌లో నగర సంకీర్తన ర్యాలీ



సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

బోధన్: గౌర పూర్ణిమను పురస్కరించుకుని గురువారం రాత్రి పట్టణ కేంద్రంలోని ఇస్కాన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ కార్యాలయం నుంచి శ్రీ బలరామ కృష్ణుల ఉత్సవ విగ్రహాలతో సంకీర్తన ర్యాలీ ప్రారంభించి పట్టణ ప్రధాన వీధుల్లో కొనసాగించారు. గౌర పూర్ణిమ ఉత్సవాలు శుక్రవారం రాత్రి నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



బోధన్‌లో దీక్షలో కూర్చున్న నాయకులు

బోధన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరిగితే 59 కులాలకు సమానమైన న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్గీకరణ నివేదికలో లోపాలను సవరించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సాలూర మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష గురువారం మూడో రోజుకు చేరింది. దీక్షలో భూరే శంకర్, దిలీప్, సాలంపాడ్, ముంజె గంగారాం, గంగాధర్, అశోక్ ఉన్నారు.

పొతంగల్‌లో..

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీస్ నాయకులు చేస్తున్న దీక్ష గురువారం ఐదో రోజుకు చేరింది. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని కోరారు. నాయకులు సాయినాథ్, సంగయ్య, విఠల్, యాదవ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులతో ఎంఈవో నాగయ్య, ఫౌండర్, కరస్పాండెంట్

బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఉన్న ఆచార్య విద్యాలయ వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో నాగయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాయిలు, బోనాల బలరాం రెడ్డి, బోనాల సంధ్యారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు భత్యం అమలు చేయాలి

బోధన్: బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దాల్‌మల్క పోశెట్టి డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని తట్టికోట కాలనీలో ఆయన కార్మికులతో కలిసి మాట్లాడారు. బీడీ కార్మికుల పోరాట ఫలితంగా 1994 ఏడాది నుంచి కరువు భత్యం అమలవుతోందన్నారు. పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1 నుంచి అమలు కావాల్సి ఉందని, బీడి యాజమాన్యం స్పందించి బీడి పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడిపరిశ్రమపై విధించిన 28 శాతం జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు మణెమ్మ, రమాదేవి, సుశీల, లక్ష్మి, గంగామణి, రాజమణి, పోచవ్వ పాల్గొన్నారు.

డీపీవోను కలిసిన జీపీ కార్యదర్శులు



డీపీవోను సన్మానిస్తున్న జీపీ కార్యదర్శులు

వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర జీపీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన డీపీవో శ్రీనివాస్‌రావును జీపీ కార్యదర్శులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జీపీలకు నిధులు రాక గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల మరమ్మతు, చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్లలో డీజిల్‌కు చెల్లింపులు లేక చాలా ఇబ్బందిగా మారిందని డీపీవోకు విన్నవించినట్లు వారు తెలిపారు.

ఫైలేరియా నివారణకు సహకరించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్

నవీపేట: గ్రామాల్లో విస్తరిస్తున్న ఫైలేరియా నివారణకు సహకరించాలని మెడికల్ ఆఫీసర్ శిఖర కోరారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వివిధ గ్రామాల కార్యదర్శులు, ఆశావర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవీపేట మండల కేంద్రంలో 30, వివిధ గ్రామాల్లో 5 ఫైలేరియా కేసులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గురునాథ్, సూపర్‌వైజర్లు, కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

షెడ్డులను తొలగించాలి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఆనుకొని, దుకాణాల సముదాయాల ముందు అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని దుకాణా నిర్వాహకులకు స్థానిక జీపీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. అక్రమంగా నిర్మించిన షెడ్లతో జాతీయ రహదారి పక్కన స్థలం లేకపోవడంతో దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారని అన్నారు. నిర్మించిన షెడ్లను వారం రోజుల్లోగా తొలగించాలని లేకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

రుద్రూర్: హోలీ వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సాయన్న సూచించారు. రసాయనాలు లేని సహజ రంగులతో హోలి జరుపుకోవాలన్నారు. రంగులు ఇష్టం లేని వారిపై బలవంతంగా రంగులు వేయవద్దని సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



బోధన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణ కేంద్రంలోని కోర్టులో మహిళా ఉద్యోగులకు స్థానిక కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ సభ్యులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.. కార్యక్రమంలో మహాలక్ష్మి, సుమలత, తులసి, గంగామణి, చిన్న గంగామణి, రాధ, కవిత, సుజాత, బైస సంగీత పాల్గొన్నారు.

రూ. లక్షల వ్యయం.. మొక్కలు మాయం

- మొక్కల చుట్టూ పెరిగిన గడ్డి
- వనసేవకులు ఉన్నా నిర్వహణ శూన్యం



మొక్కల చుట్టూ ఉన్న గడ్డి

బాల్కొండ: ముప్కాల్ శివారులోని ఎస్సారెస్పీ పంపుహౌస్ సమీపంలో నాటిన మొక్కల పెంపకం గాలికొదిలేశారు. 2023లో రూ. 9 లక్షల వ్యయంతో ఇన్‌స్టిట్యూషనల్ మొక్కల పెంపకంలో భాగంగా పునరుజ్జీవన పథకం వద్ద మొక్కల పెంపక ప్రక్రియను ప్రారంభించారు. రెండేళ్లు అవుతున్నా మొక్కల ఎదుగుదల అంతంతే ఉంది. మొక్కల పెంపకానికి ఇద్దరి వన సేవకులను కేటాయించినా నిర్వహణ సరిగా లేకపోవడంతో మొక్క లు పెరగడం లేదు. ఫలితంగా ప్రజా ధనం వృథాగా పోతోంది. ఈ మొక్కల పెంపకం ఈజీఎస్ ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది. పర్యవేక్షణ కరువవడంతో మొక్కలు మాయమవుతున్నాయి. మొక్కల చుట్టూ కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎస్సారెస్పీ ఆనకట్టపై టార్గెట్‌ల కోసం మొక్కలను నాటారు. కానీ వాటి నిర్వహణ మరిచారు. ఫలితంగా గత వానకాలం సీజన్‌లో నాటిన మొక్క ఒక్కటి కూడా కనిపించడం లేదు. నాటిన మొక్కలకు రక్షణ లేకపోవడంతో పశువులు మేసి వెళ్లాయి. ఇకనైనా అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పిచ్చిమొక్కలు తొలగిస్తాం

పునరుజ్జీవన పథకం వద్ద ఉన్న మొక్కల్లో పెరిగిన గడ్డిని తీయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇద్దరు వనసేవకులు ఉన్నారు. వారితో క్రమక్రమంగా పిచ్చి మొక్కలను తొలిగింపజేస్తాం.
– శకుంతల, ఏపీవో, ముప్కాల్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	యుగానికి ఒక్కడు (తెలుగు)-10.50, 7.05 ల్యాంప్(తెలుగు)-1.55 1000 వాలా(తెలుగు)-4.20 ఛావా(హిందీ)-10.10
స్క్రీన్-2	ఛావా(తెలుగు)-11.30, 2.50, 6.10, 9.30
స్క్రీన్-3-	దిల్‌రూబా (తెలుగు) - 10.15, 1.25, 7.30, 10.40 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-4.35
స్క్రీన్-4	కోర్ట్(తెలుగు)-10.00, 1.05, 4.10, 7.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దిల్‌రూబా(తెలుగు) - 11.00, 4.35, 7.30, 10.25 ఛావా(హిందీ)-1.40
స్క్రీన్-2	యుగానికి ఒక్కడు -11.00, 4.40 కోర్ట్(తెలుగు)-1.45, 7.35, 10.30
స్క్రీన్-3	ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.30, 7.30 ఛావా(తెలుగు)-4.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(తెలుగు)-10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.20 కోర్ట్(తెలుగు)-7.35, 10.40
స్క్రీన్-2	కోర్ట్(తెలుగు)-10.00, 4.25 ఛావా(తెలుగు)-1.05, 7.30 ఛావా(హిందీ)-10.50
స్క్రీన్-3	ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్(తెలుగు)-5.10 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.35 యుగానికి ఒక్కడు(తెలుగు)-10.45
స్క్రీన్ -4	దిల్‌రూబా(తెలుగు)-10.15, 4.10, 7.20, 10.30 1000 వాలా(తెలుగు)-1.25
లలితామహల్	కోర్ట్ (తెలుగు)-11.00, 2.00, 6.00 10.00
దేవి	దిల్‌రూబా(తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
నటరాజ్	యుగానికి ఒక్కడు (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
విజయ్	ఛావా (తెలుగు)-10.30, 2.15, 6.10, 10.05

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	82,047		

– నిజామాబాద్ బిజినెస్

ఘనంగా హోలీ సంబురాలు

గ్రామీణ ప్రాంతాల్లో హోలీ సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు రంగులు చల్లుకున్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో కామదహనం నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ సభ్యులు గుడాలను పంపిణీ చేశారు. సాలూర మండల కేంద్రంలో, రెంజల్ మండలం దూపల్లిలో కుస్తీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. –సాక్షి నెట్‌వర్క్



బాల్కొండలో హోలీ వేడుకల్లో గ్రామస్తులు



వేల్పూర్: పచ్చలనడ్కుడ ప్రైమరీ స్కూల్‌లో హోలీ ఆడుతున్న చిన్నారులు



రుద్రూర్‌లో కామ దహనం చేస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్



పోచారంలో హోలీ ఆడుతున్న గ్రామస్తులు



నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్‌లో హోలీ ఆడుతున్న యువకులు



నందిపేటలో..



చిక్కడపల్లిలో కామదహనం చేస్తున్న గ్రామస్తులు